

నాగోబాకు పోటెత్తిన భక్తజనం

నాగోబా జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

8లో▸



గిరిజనాభివృద్ధే ధ్యేయం..

గిరిజన ప్రాంతాల సంపూర్ణ అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో మాట్లాడారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
32.1 /16.1

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వేకువజామున మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు రేషన్ డీలర్ల భర్తీకి ఇంటర్వ్యూలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 27 రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకోసం శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆర్డీఓ రమేశ్ రాథోడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్షలో ప్రతిభ కనబర్చిన అభ్యర్థుల్లో 1:5 నిష్పత్తిన ఇంటర్వ్యూకు పిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఆర్డీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

సిరికొండ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నాగరాజు

సిరికొండ(బోథ్): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ఆదర్శ పాఠశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న సిరికొండ గ్రామానికి చెందిన ముత్యపు నాగరాజు డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో గిరిజన అభివృద్ధి పథకాల ప్రభావం అనే అంశంపై చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ప్రతిష్టాత్మక పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. గురువారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ మురళి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నాడు.

మోదీ హయాంలోనే గ్రామీణ క్రీడలకు పెద్దపీట



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న శంకర్

ఆదిలాబాద్‌రూరల్: ప్రధానమంత్రి మోదీ హయాంలోనే గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేయడం జరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మావల మండలం వాఘాపూర్ గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కబడ్డీ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు.

అభివృద్ధిలో అగ్రస్థానం వైపు..

- సమష్టి కృషితో జిల్లా సమగ్రాభివృద్ధి
- పోలీస్‌శాఖ అగ్రస్థానంలో నిలవడం అభినందనీయం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్
- కలెక్టరేట్‌లో మువ్వన్నెల జెండా ఎగురవేత



జాతీయ గీతాలాపన చేస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్, ఎస్పీ, ఎమ్మెల్యే



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లాలో 74వ గణతంత్ర వేడుకలను గురువారం సాదాసీదాగా నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జాతీయ పతకం ఎగురవేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జాతీయ గీతాలాపన చేశారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలన్నింటినీ వేగవంతం చేస్తున్నామన్నారు. పల్లె, పట్టణ ప్రగతి, హరితహారం కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. పారిశుధ్యం, ఆరోగ్యపరంగా జిల్లాలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. పాఠశాలలను సుందరీకరించేందుకు చేపట్టిన మన ఊరు–మన బడి కార్యక్రమం కింద తొలి విడత 237 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఇందులో 20 పాఠశాలల్లో ఫర్నీచర్, పెయింటింగ్, తాగునీరు, విద్యుత్, బోధన పరమైన వసతులతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. మరో పది రోజుల్లో ఈ పాఠశాలలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నమన్నారు. 33 టీంల ద్వారా ప్రతిరోజు 5,500 మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. శాంతిభద్రతలు, నేరాల నియంత్రణలో ఆదిలాబాద్ జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానం, దేశంలో ఐదోస్థానంలో నిలవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇందుకు తోడ్పడిన జిల్లా ఎస్పీ, పోలీసుశాఖకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే జోగు రామన్న, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషాషేక్, ఎన్.నటరాజ్, ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ, అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావు, జాన్‌సమయ్‌రావు, డీఎఫ్‌వో రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



జెండా ఆవిష్కరణకు వస్తున్న కలెక్టర్, ఎస్పీ, జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే



నార్నూర్‌లో జెండా ఎగురవేస్తున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ...



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ జాతీయ పతాకం ఎగురవేశారు. క్యాంపు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన చేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ పెన్నులు, నోట్ పుస్తకాలతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమేశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ కిరణ్‌కుమార్, డీసీఓ శ్రీనివాస్‌రావు, ట్రెజరీ డీడీ జాదవ్ రమేశ్ కుమార్, కలెక్టరేట్ ఏఓ అరవింద్ కుమార్, సూపరింటెండెంట్లు రాజేశ్వర్, నలందప్రియా, వర్ణ, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

'అటవీ అధికారులను విధుల నుంచి తొలగించాలి'



లింబారావును పరామర్శిస్తున్న దౌలత్‌రావు

ఆదిలాబాద్‌రూరల్: వంటచెరుకు కోసం అడవికి వెళ్లిన నార్నూర్ మండలంలోని నాగల్‌కొండకు చెందిన ఆదివాసీ రైతు కోవ లింబారావుపై దాడికి పాల్పడిన అటవీశాఖ అధికారులను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మొకాశి డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారుల దాడిలో గాయాలపాలై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న లింబారావును గురువారం ఆయన పరామర్శించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో తిరుగుబాటుకు సన్నద్ధం కావాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆయన వెంట ఆదివాసీ సేన రాష్ట్ర కమిటీ సభ్యులు, ఆదివాసీ సేన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి రాయిసిడాం జంగు పటేల్, ఆదివాసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు మండడి లక్ష్మణ్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆడ మానిక్‌రావు, రైతు సేన జిల్లా అధ్యక్షుడు తొడసం భూమ పటేల్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గోడం జ్యోతిరాం, తదితరులు ఉన్నారు.

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

ఉట్నూర్‌రూరల్: వంటచెరుకుకోసం అడవికి వెళ్లిన నార్నూర్ మండలంలోని నాగల్‌కొండకు చెందిన ఆదివాసీ రైతు కోవ లింబారావుపై అటవీశాఖ అధికారులు దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ ప్రజాసంఘాల నాయకులు సోయం చిన్నన్న, జంగు, దీపక్, త్రిమూర్తి, సతీశ్, భిక్షపతి, ఆనంద్ పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఆదివాసీలకు సబ్సిడీ గ్యాస్ కనెక్షన్ లేకపోవడంతో వంట చేసుకోవడానికి అడవులపై ఆధారపడుతున్నారన్నారు. ఇలాంటి నిరుపేద ఆదివాసీలపై దాడి చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన అటవీశాఖ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

బదిలీ, పదోన్నతుల ప్రక్రియ షురూ

- ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- మార్చి 4 వరకు కొనసాగనున్న ప్రక్రియ

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ ఎట్టకేలకూ బుధవారం రాత్రి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విడుదల చేశారు. బదిలీల మార్గదర్శకాలకు సంబంధించిన జీఓ 5ను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు స్థానచలనం జరగనుంది. అంతేకాకుండా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియకు మోక్షం లభించింది. రెండు రోజుల క్రితం ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. సీనియారిటీ జాబితాలో దొర్లిన తప్పులను సవరించి ఆన్‌లైన్‌లో జాబితాను అందుబాటులో ఉంచారు. శుక్రవారం ఖాళీల జాబితా, పాఠశాల కేటగిరీ, పదోన్నతులకు సంబంధించిన ఖాళీలను విడుదల చేయనున్నారు.

షెడ్యూల్ విడుదల..

ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులకు సంబంధించి షెడ్యూల్ విడుదల కావడంతో విద్యాశాఖాధికారులు కసరత్తు చేపట్టారు. గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగినప్పటికీ పనుల్లో నిమగ్నమయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం పదోన్నతి కోసం ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఈనెల 27 నుంచి మార్చి 4 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. బదిలీ కోసం ఈనెల 28 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 7,8 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 11, 12 తేదీల్లో హెచ్‌ఎంలు వెబ్‌సైట్‌లో పాఠశాలల ఎంపిక, 14న ప్రధానోపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు, ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించనున్నారు. 22, 23 తేదీల్లో ఎస్‌ఏల బదిలీలు, 25 నుంచి 27 వరకు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు, మార్చి 4న ఎస్జీటీలకు బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం మార్చి 5 నుంచి 19 వరకు బదిలీ, పదోన్నతుల్లో ఏమైనా పొరపాట్లు జరిగితే ప్రభుత్వానికి నివేదించేందుకు అధికారులు అవకాశం కల్పించారు.



సీనియారిటీ జాబితాను రూపొందిస్తున్న ఉద్యోగులు

బదిలీ, పదోన్నతులు ఇలా..

జిల్లాలో 8 సంవత్సరాలు ఒకే పాఠశాలలో పనిచేసి తప్పనిసరిగా బదిలీ అయ్యే పీఎస్ హెచ్‌ఎంలు 12 మంది, స్కూల్ అసిస్టెంట్లు 115 మంది, ఎస్జీటీలు 382 మంది, ఎల్‌పీలు 42 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. ఒకే పాఠశాలలో ఐదేళ్లు పనిచేసి తప్పనిసరిగా బదిలీ అయ్యే ప్రధానోపాధ్యాయులు 27 మంది ఉన్నారు. కాగా జిల్లాలో 41 మంది ప్రధానోపాధ్యాయులకు, ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ కోసం 256 మందికి పదోన్నతి లభించనుంది. వీరిలో ముగ్గురు పీఈటీ నుంచి పీడీలుగా పదోన్నతి పొందనున్నారు.

ప్రక్రియ కొనసాగుతోంది



ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులకు సంబంధించి ప్రక్రియ కొనసాగుతోంది. పదోన్నతులకు సంబంధించి ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించాం. సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చాం. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ముందుకెళ్తాం. ఈ ప్రక్రియను పారదర్శకంగా చేపడతాం.

– ప్రణీత, డీఈఓ, ఆదిలాబాద్

జిల్లాలో ఉపాధ్యాయుల ఖాళీలు

పీజీ హెచ్‌ఎం :	44
పీఎస్ హెచ్‌ఎం :	59
ఎస్‌ఏ :	207
ఎస్జీటీలు :	201
భాషా పండితులు :	18
ఒకేషనల్ టీచర్లు :	14

బదిలీ మార్గదర్శకాలు ఇవే..

- ఒకే పాఠశాలలో ఐదేళ్లు పూర్తి చేసిన ప్రధానోపాధ్యాయులను తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు.
- బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు పాఠశాలలో రెండేళ్లపాటు పాటు పనిచేసి ఉండాలి.
- ప్రిపరేషన్ కేటగిరీలో ఉపాధ్యాయులకు ముందుగా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. వితంతువులు, వ్యాధులతో బాధపడుతున్న వారికి, మానసిక వైకల్యం గల పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు బదిలీల్లో మొదటి ప్రాధాన్యతనిస్తారు.
- ప్రత్యేక కేటగిరీగా ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు 10 పాయింట్లు కేటాయిస్తారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే 10 పాయింట్లు.
- పాఠశాలలను పాయింట్ల వారీగా 3 కేటగిరీలుగా విభజించారు. 17 హెచ్‌ఆర్‌ఏ శాతం ఉన్నవారికి ఏడాదికి ఒక పాయింట్, 13 హెచ్‌ఆర్‌ఏ పొందుతున్న వారికి 2 పాయింట్లు, 11 శాతం హెచ్‌ఆర్‌ఏ పొందుతున్న వారికి 3 పాయింట్లు కేటాయిస్తారు.
- సర్వీస్ పాయింట్లు ఏడాదికి 2 పాయింట్లు కేటాయిస్తారు.

సరస్వతీ నమస్తుభ్యం

- బాసరలో ఘనంగా వసంత పంచమి వేడుకలు
- అమ్మవారి జన్మదినం సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు
- తెల్లవారుజామునుంచే గోదావరిలో పుణ్యస్నానాలు..
- అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు..
- దర్శనానికి నాలుగు.. అక్షరాభ్యాసానికి ఏడు గంటల సమయం
- క్యూలైన్లలో నిరీక్షించలేక ఇబ్బంది పడ్డ చిన్నారులు, వృద్ధులు

భైంసా/ముధోల్: చదువుల తల్లి సరస్వతీ క్షేత్రం బాసరలో వసంత పంచమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘ శుద్ధ పంచమి రోజు అమ్మవారి జన్మదినం నిర్వహిస్తున్న సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. బుధవారం రాత్రే సుమారు 50 వేల మంది భక్తులు బాసరకు చేరుకున్నారు. దీంతో ఆలయ అధికారులు గురువారం తెల్లవారుజామున 2 గంటల నుంచే అమ్మవారికి పూజలు ప్రారంభించారు. అర్చకులు అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు బాసర ఆలయ గర్భగుడిని పూలతో అలంకరించారు. ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన ద్వారం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ప్రవేశం వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అతిథి గృహాల ముందు బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను లోనికి అనుమతించారు. అమ్మవారి పూజల అనంతరం దర్శనానికి అనుమతించడంతో భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ అధికారులు భాజాభజంత్రీలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యేలు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు

ఆలయ అభివృద్ధికి కృషి...

అమ్మవారి దర్శనం అనంతరం మంత్రి క్యూలైన్లలో నిల్చున్న భక్తులతో మాట్లాడారు, పాలు, అరటిపండ్లు అందించారు. తర్వాత మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామని తెలిపారు. వచ్చే వసంత పంచమి నాటికి మరిన్ని వసతి గృహాలు నిర్మిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభించామని పేర్కొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న వేదపండితుడు

భక్తులతో పోటెత్తిన బాసర..

అమ్మవారి పుట్టిన రోజు అయిన వసంత పంచమి రోజు అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించాలని రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు బాసరకు తరలివచ్చారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు మంత్రి, ఎమ్మెల్యే రావడంతో అధికారులు సుమారు గంటపాటు దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. పూజలు వాయిదా వేసుకున్నవారు కూడా ఈ వసంత పంచమికి బాసరకు వచ్చారని తెలిపారు. గురువారం ఒక్కరోజే 6,872 అక్షరాభ్యాస పూజలు జరిపించామని పేర్కొన్నారు. ఇందులో రూ.1000 అక్షరాభ్యాస పూజ లు 4,046, రూ.150 అక్షరాభ్యాస పూజలు 2,826 జరిపించామని వివరించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

వసంత పంచమి పురస్కరించుకుని బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు పలువురు ప్రముఖులు బాసరకు చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు, ఈటల రాజేందర్ సతీమణి జమున, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీజేపీ నాయకులు రామారావ్‌పటేల్ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు

క్లుప్తంగా

మరణానంతరం సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న ఉబేద్

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగులకు జీవించి ఉన్నప్పుడే పురస్కారాలు, ప్రశంసలు దక్కడం సహజం కానీ మరణానంతరం సైతం తన సేవలకు గుర్తింపునిచ్చి గౌరవించడమనేదీ అరుదు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర్య వేడుకల్లో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. పంచాయతీరాజ్ ఆదిలాబాద్ డీఈగా పనిచేసిన సయ్యద్ రఫతుల్లా గతేడాది అక్టోబర్ 30న సీతాగొంది వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. డీఈగా ఆయన అందించిన సేవలకు ఆ శాఖ గుర్తింపునిస్తూ ప్రశంసపత్రానికి ఎంపిక చేసింది. కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో ఆయన కుమారుడు సయ్యద్ ఉబేద్‌కు కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకోవడం విశేషం.

హెచ్‌ఎం తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆలస్యంగా జాతీయజెండా ఆవిష్కరణకు కారణమైన హెచ్‌ఎంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో జెండా ఎగురవేసే కార్యక్రమానికి గ్రామంలోని ప్రజాప్రతినిధుల తోపాటు ఎవరికీ కూడా సమాచారం ఇవ్వలేదని సర్పంచ్ మహేందర్, ఉపసర్పంచ్ దొనికెని సాగర్, పలువురు గ్రామ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ప్రధానోపాధ్యాయుడు గురువారం ఆలస్యంగా రావడంతో ఉదయం 8.30 వరకు ఎగరాల్సిన జెండాను 9.20కి ఎగురవేశారని పేర్కొన్నారు. ఈ విషయమై సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామస్తులు హెచ్‌ఎంను ప్రశ్నించడంతో, జెండా ఆలస్యమైన విషయంపై తనపై జిల్లా అధి కారులకు ఫిర్యాదు చేసిన వారికి దావత్ ఇస్తానని అనడంతో తీవ్రంగా మండిపడుతున్నారు.

ట్రిపుల్ ఐటీలో గణతంత్ర వేడుకలు



జెండా ఎగురవేస్తున్న వీసీ వెంకటరమణ

భైంసా: బాసర ఆర్జీయూకేటీ(ట్రిపుల్‌ఐటీ)లో గురువారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం వర్సిటీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రూ.50 కోట్లతో ఇప్పటివరకు పలు పనులు చేపట్టినట్లు వెల్లడించారు. హెచ్‌ఎండీఏ, మున్సిపల్ శాఖ తరఫున గ్రీన్ క్యాంపస్ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. విజన్ 2025 లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్స్, అడ్మినిస్ట్రేటివ్ హెడ్స్, స్పోర్ట్స్ స్పెషల్ ఆఫీసర్, ప్రభాకర్‌రావు, పీడీ శ్యాంబాబు, రవికిరణ్, వసంత తదితరులు పాల్గొన్నారు.

నాగోబాకు పోటెత్తిన భక్తజనం



ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించుకున్నారు. నాగోబా జాతర పరిసర ప్రాంతాల భక్తులు ఎడ్ల బండ్లపై నాగోబా ఆలయానికి చేరుకున్నారు. నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయల వద్ద ఇళ్లకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. ఈ నెల 28 వరకు అధికారికంగా నాగోబా జాతర కొనసాగనుంది.



రంగులరాట్నాల వద్ద సందడి



జాతరలో ఇంటి సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు



ఎడ్ల బండిపై జాతరకు వస్తున్న భక్తులు

గిరిజనాభివృద్ధే ధ్యేయంగా ముందుకు..



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి



ప్రశంస పత్రం అందిస్తున్న పీవో

ఉట్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధీనంలోని గిరిజన ప్రాంతాల సంపూర్ణ అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం ఐటీడీఏ ప్రాంగణంలో జెండా ఎగురవేసి మాట్లాడారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధి లక్ష్యంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 917 గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో 12,945 మంది గిరిజన విద్యార్థులకు 681 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని, అలాగే 133 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 34,658 గిరిజన విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకుంటున్నారని తెలిపారు. అలాగే ఐటీడీఏ పరిధిలోని 32 పీహెచ్‌సీలు, 186 ఉప ఆరోగ్యకేంద్రాలు, రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. వనబంధు కల్యాణ యోజనా ద్వారా ఏజెన్సీలోని కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాల్లో వైద్య, వైద్య, వ్యవసాయం, విద్యుత్, మంచినీటి సరఫరా, ఇతర మౌలిక వసతులు కల్పన కోసం పది కోట్లు విడుదల కాగా ఇప్పటికి రూ. 7.50 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన సహకార సంస్థ ద్వారా 17 పెట్రోల్ పంపులు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయగా ఆరు బంకులు ఏర్పాటు చేశామన్నారు. 97 మంది ఉత్తమ అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావ్, ఐటీడీఏ ఏవో రాంబాబు, ఏపీవో జనరల్ కనక భీంరావ్, ఆర్డీవో సురేశ్, డీటీడీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, జీసీడీవో చాయా, ఆర్సీవో గంగాధర్, జేడీఎమ్ నాగాభుషణం, ఐసీడీఎస్ సీడీపీవో శ్రావణి పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేలా శ్రమించాలి'



యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్:కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి వచ్చేలా ప్రతీ కార్యకర్త శ్రమించాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ఉంటుందన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషిని ప్రతీ కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలను, చరిత్రను గుర్తు చేయాలని సూచించారు. రెండు నెలలు జరగనున్న ఈ కార్యక్రమంలో భారత్ జోడో యాత్రలో రాహుల్ సందేశం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, జిల్లా, పట్టణ, మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

దేశ ప్రజలంతా ఆత్మగౌరవంతో, సమానత్వంతో, సమాన హక్కులతో సగర్వంగా జీవించేదుకు అవకాశం కల్పించిన ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం మనదని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. అంతటి మహోన్నతమైన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మహేశ్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన 74వ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 74 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

వాహనం బోల్తా..

నేరడిగొండ: మండలంలోని రోల్‌మమడ జాతీయ రహదారిపై గురువారం ఉదయం తుఫాన్ వాహనం బోల్తాపడిన సంఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే...కేరళ రాష్ట్రం నుంచి తుఫాన్ వాహనంలో మధ్యప్రదేశ్‌కు చెందిన 20మంది కూలీలు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని రోల్‌మమడ జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు డీవైడర్‌ను ఢీకొని వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎన్‌హెచ్‌ఏఐ పెట్రోలింగ్ సిబ్బంది నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డెక్కిన రైలుబండి



జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై వెళ్తున్న ఎలక్ట్రికల్ రైలుబండి

నిర్మల్‌టౌన్: వేదం గ్లోబల్ స్కూల్ వారి ఎలక్ట్రికల్ రైలు జిల్లా కేంద్రంలో గురువారం రోడ్డెక్కి సందడి చేసింది. వసంత పంచమిని పురస్కరించుకొని పాఠశాల ఆధ్వర్యంలో రోడ్డుపై రైలు నడుపుతూ విద్యార్థులు నూతన అడ్మిషన్ల కోసం కాన్వసింగ్ నిర్వహించారు. దీంతో పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

ఫుడ్‌సేఫ్టీ తనిఖీలు శూన్యం

● నాగోబా జాతరలో ఇష్టానుసారంగా హోటళ్ల నిర్వహణ



ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి జాడలేకుండా పోయారు. దీంతో హోటల్ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు జాతర ప్రారంభం నుంచి ముగింపు వరకు తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అయినా ఆ ఆదేశాలను ఫుడ్‌సేఫ్టీ అధికారులు బేఖాతర్ చేశారు. దీంతో హోటల్ వ్యాపారులు తినుబండారాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో, ఆహార పదార్థాలపై కనీసం దుమ్ముధూళి పడకుండా కవర్లు కూడా కప్పడం లేదు. దీంతో ఆ ఆహార పదార్థాలు తిని భక్తులు అనారోగ్యానికి గురై అవకాశాలు లేకపోలేదు.

హోమియోపతి పీజీ ఎంట్రెన్స్‌లో ప్రతిభ



కొత్తపల్లి సుజ్జన్

కుంటాల : జాతీయస్థాయి హోమియోపతి పీజీ ఎంట్రెన్స్‌లో కుంటాలకు చెందిన కొత్తపల్లి గంగామణి–బుచ్చన్న దంపతుల కుమారుడు కొత్తపల్లి సుజ్జన్ ప్రతిభ కనబర్చాడు. 2022, సెప్టెంబర్‌లో పరీక్ష నిర్వహించగా, ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఇందులో సుజ్జన్ 52వ ర్యాంకు సాధించాడు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి కోల్‌కత్తాలో రిఫర్‌టీ విభాగంలో సీటు సాధించాడు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



ప్రశంసపత్రం అందుకుంటున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్

కైలాస్‌నగర్: విధి నిర్వహణలో అంకితభావంతో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులకు 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రశంస పత్రాలు అందజేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న, తదితరులు హాజరయ్యారు.



శ్రీనివాస్, కలెక్టర్ ఓఎస్‌డీ
ఎ.రాజేశ్వర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్



సౌజన్య, టైపిస్టు, కలెక్టరేట్
అశ్విని, స్టెనో, కలెక్టరేట్



రాఘవేందర్, తహసీల్దార్, జైనథ్
బి.రమేశ్, నాయబ్ తహసీల్దార్, ఇంద్రవెల్లి
దేవేందర్, న్యాయవాది
నైలు, సీఐ, ఇచ్చోడ
చంద్రమౌళి, ఇన్‌స్పెక్టర్, సీసీఎస్, ఏడీబీ



కే.నరేశ్‌కుమార్, సీఐ, జైనథ్
విష్ణువర్ధన్ ఎస్సై, మావల
జె.గోవర్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ ఫైర్‌ఆఫీసర్
రాజేశ్వర్, ఎక్సైజ్ ఎస్సై, ఇచ్చోడ
ఎన్.రమేశ్, ఏడీఏ, ఆదిలాబాద్



ప్రవీణ్ కుమార్, బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్
పూర్ణచందర్, ఎస్సీఅభివృద్ధి శాఖ సూపరింటెండెంట్
ప్రియాంక, ఏఈఈ, ఆదిలాబాద్
పి.సాధన, డెప్యూటీ డీఎంహెచ్‌వో
ఇద్రిస్ అక్బానీ (మెడికల్ సూపరింటెండెంట్, రిమ్స్)



కె.నర్సయ్య, సెక్టోరియల్ అధికారి
సురేశ్, ఏఎంవీఐ
బి.శృతి, సూపర్‌వైజర్, జైనథ్
దేవరాజ్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్
ఎం.సోము, తహసీల్దార్, ఇంద్రవెల్లి



జి.రమేశ్, వార్డర్, జైళ్లశాఖ
బి.శంకర్, ప్రిన్సిపాల్, బోథ్
ఎన్.నారాయణ, సెక్టోరియల్ అధికారి
ఎం.శ్రీనివాస్, ఎంపీడీఓ, భీంపూర్
భాగ్యలక్ష్మి, నాయబ్ తహసీల్దార్, గుడిహత్నూర్



ప్రమోద్, ల్యాబ్ టెక్నీషియన్, రిమ్స్
విజయసారథి, మెడికల్ ఆఫీసర్
దుర్గం శేఖర్, దుర్గం ట్రస్ట్ చైర్మన్
మసూద్ అహ్మద్, అకౌంటెంట్, గాంధీపార్కు
మట్టే రవీందర్, పీఆర్‌ఓ, రిమ్స్



బైరి సాంబయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్
సుమన్, ఎస్సై, ఉట్నూర్
షేక్ మురాద్‌అలీ, ఐటీ కోర్ ఇన్‌చార్జి
తులసి, ఏఎన్‌ఎం, ఆదిలాబాద్
శివకుమార్, ఫొటోగ్రాఫర్, డీపీఆర్వో
శేఖర్, ఆఫీస్ సబార్డినేట్